ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 61 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 14 జూన్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# హైదరాబాద్‌లో భారీ వర్షం



## అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్

## అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వెళ్లాలని ఆదేశం

**హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, సనత్ నగర్, ఫిలింనగర్, పంజాగుట్ట, ఎర్రగడ్డ, బోరబండ, మహేశ్వరం, తుక్కుగూడ, పహాడీషరీఫ్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, హైదర్ నగర్, ప్రగతినగర్, మూసాపేట్ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. శంషాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోంది. రోడ్డంతా నీటితో నిండిపోవడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ...మిగతా 2లో

## రహదారులు జలమయం



# కార్మిక సంక్షేమంలో రాజీపడేది లేదు

## సింగరేణి జోలికొస్తే ఊరుకోం

## బీజేపీ, బీఆర్ఎస్ కుట్రలను అణచివేస్తాం

### సింగరేణికి నష్టం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం

### 335 మందికి కారుణ్య నియామక పత్రాలు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మంచిర్యాల జూన్ 13 (ప్రభాత ఉదయం)**

మంచిర్యాల జిల్లా కేంద్రంలో సింగరేణి డిపెండెంట్ కార్మికుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం కోలాహలంగా జరిగింది. సింగరేణి సంస్థలో కారుణ్య నియామకాల కింద ఎంపికైన 335 మంది డిపెండెంట్ కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై నియామక పత్రాలను అందజేశారు. సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్ లో వైద్య పరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు అందించే కార్యక్రమానికి రాష్ట్ర ఐ.టి., ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ...మిగతా 2లో







## ఫోన్ ట్యాపింగ్ కేసులో

# కీలక పరిణామం

## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాంగ్మూలం నమోదు

**హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం



## వ్యవహారాన్ని రేవంత్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు: మహేశ్ గౌడ్

### మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ

### ఆమెకు సంబంధించిన వివరాలను లీక్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేత

### అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్

2

# షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసులు

## మహిళలు, పార్టీ నాయకత్వంపై షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు

**హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హైకమాండ్ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా, అలాగే పార్టీ నాయకత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వైరల్ అయిన ఆడియోలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై కూడా షబ్బీర్ అలీ అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆడియో సోషల్ మీడియాలో విస్తృతంగా చక్కర్లు కొట్టడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అంతర్గత వ్యవహారాలను బహిరంగ చర్చకు తీసుకురావడంపై కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన నుంచి వివరణ కోరుతూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది.



# అసోంలో కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

## ఐదురుగు వైమానిక సిబ్బంది మృతి



**గౌహతి,జూన్13(ప్రభాత ఉదయం)**

అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు ...మిగతా 2లో



## పాస్ పోర్ట్ సేవల్లో

# తెలంగాణ పోలీస్ భేష్

## 19న ఢిల్లీలో జైశంకర్ చేతుల మీదుగా అవార్డు

**హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం)**

పాస్‌పోర్ట్ సేవల్లో తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. దేశంలోనే ఉత్తమ పోలీసు ధ్రువీకరణ సేవలకు గాను 'ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు' వరించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో అత్యుత్తమ పనితీరుకు గాను తెలంగాణ పోలీస్ శాఖకు ఈ అవార్డు లభించింది. ఈ మేరకు తెలంగాణ పోలీస్ శాఖను కేంద్ర విదేశాంగ ...మిగతా 2లో

# కార్మిక సంక్షేమంలో రాజీపడేది లేదు

**మొదటి పేజీ తరువాయి**

పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రాష్ట్ర షెడ్యూల్ తెగలు, గిరిజన, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ, శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల, బెల్లంపల్లి, భూపాలపల్లి, వైరా నియోజకవర్గాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, సత్యనారాయణ, మలోత్ రాందాస్ నాయక్, సింగరేణి కార్మిక సంఘాల ప్రతినిధులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్, సింగరేణి సీఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్ ప్రజా ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సంక్షేమంలో రాజీపడేది లేదని, సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి అని, ప్రజాస్వామ్య రక్షణలో జాగరుకతతో ఉంటామని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ పునరుద్ధరణ కొరకు 70 కోట్ల రూపాయలు, మినీ లిఫ్ట్ ఇరిగేషన్ కొరకు 74 కోట్ల 40 లక్షల రూపాయలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందనితెలిపారు. వైద్యపరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగులకు సంబంధించిన 335 మంది అర్హత గల అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరుగుతుందని, భవిష్యత్తులో మరింత మంది అర్హులకు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకుందాం అని, తెలంగాణ ఆస్తిగా తీర్చిదిద్దుదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల బీమా అందించడం జరుగుతుందని, 30 వేల మంది ఒప్పంద,పొరుగు సేవల సిబ్బందికి బోనస్ అందించామని తెలిపారు. కోల్ బ్లాక్స్ లలో పూర్తి నిఘా వ్యవస్థ మధ్యలో పని జరుగుతుందని, తెలంగాణ వనరులను కాపాడతామని తెలిపారు. కోల్ బెల్ట్ ప్రాంతంలోని శాసనసభ్యులతో మాట్లాడి కార్మిక సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి సంస్థ సమన్వయంతో సింగరేణి బొగ్గు గనులను మరింత అభివృద్ధి చేసి కార్మికుల సంక్షేమం దిశగా కృషి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం వల్లే సింగరేణికి నష్టం చేసిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బిజెపి రెండు ఒకటే అని పేర్కొన్నారు.

**కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా ఇచ్చాం – మంత్రి శ్రీధర్ బాబు**

సింగరేణి సంస్థను, తెలంగాణ నల్ల బంగారం బొగ్గును కాపాడుకుందాం అని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మెడికల్ అన్ ఫిట్ విషయంలో పారదర్శకంగా ముందుకు వెళదామని తెలిపారు. సింగరేణి కార్మికులకు 1 కోటి 25 లక్షల రూపాయలతో పాటు ఒప్పంద/పొరుగు సేవల సిబ్బందికి 40 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని తెలిపారు. సింగరేణి సంస్థ లాభాలలో సింగరేణి కార్మికులతో పాటు ఒప్పంద కార్మికులకు లాభాల వాటా అందించడం జరిగిందని తెలిపారు.

**రిటైర్డ్ కార్మికులకు తెల్ల రేషన్ కార్డు ఇప్పించాం**

**ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**

నియామక పత్రాలు అందుకున్న 335 మందిలో 117 మంది మంచిర్యాల జిల్లాకు చెందిన వారు కావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో మారుపేరు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, ఒక కమిటీని నియమించి పర్యవేక్షించడం జరుగుతుందని, బాధితులకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం కార్మికుల పక్షాన ఉంటుందని, పదవీ విరమణ పొందిన సింగరేణి కార్మికులకు తెల్ల రేషన్ కార్డులు అందించడం జరిగిందని తెలిపారు. రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులు అందిస్తున్న కార్మికుల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలిపారు. సింగరేణి ప్రాంతాలలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను పదవీ విరమణ పొందిన కార్మికులకు అందించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింప చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్నులు వెసలుబాటు కల్పించాలని, జిల్లాలోని మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో గల శ్రీరాంపూర్ ప్రాంతంలో అర్హులకు పట్టాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆలయాల అభివృద్ధికి పెద్దపీట

### గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణం మంత్రులతో కలిసి శంకుస్థాపన చేసిన భట్టి



**మంచిర్యాల, జూన్13(ప్రభాత ఉదయం)**

కేవలం దైవభక్తి కోసమే కాకుండా, సమాజంలో మార్పు కోసం విద్యకు , రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ప్రసిద్ధ గూడెం సత్యనారాయణ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లకeణ్ కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారంతా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే సమాజంలో ఉన్నతమైన మార్పులు తీసుకురావచ్చని తాము గట్టిగా నమ్ముతున్నట్లు చెప్పారు. గతంలో రేవంత్ రెడ్డి చేపట్టిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్ర మూడేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన పిప్పిరి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గూడెం ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ మాట ఇచ్చిన కేవలం 37 రోజుల్లోనే నిధులు మంజూరు చేసి, ఈ రోజు భూమి పూజ చేసుకోవడం తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. గూడెం సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రూ. 70 కోట్లతో అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నట్లు ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు తమ ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 2,216 కోట్లతో వివిధ దేవాలయాలను అభివృద్ధి చేసిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో భాగంగానే ఇటీవల సరస్వతీ పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, అలాగే రాబోయే గోదావరి పుష్కరాల కోసం కూడా రూ. 802 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవైపు దైవభక్తి కోసం నిధులు ఇస్తూనే, మరోవైపు అన్నదాతలను ఆదుకునేందుకు రూ. 74 కోట్ల వ్యయంతో 'గూడెం లిఫ్ట్ ఇరిగేషన్' పనులను కూడా చేపడుతున్నామని, దీనివల్ల స్థానిక రైతులకు సాగునీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయని డిప్యూటీ సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.



## విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి: మల్లారెడ్డి

**హైదరాబాద్, జూన్ 13(ప్రభాత ఉదయం)**

విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సీఎంఆర్ సంస్థల అధినేత మల్లారెడ్డి అన్నారు.మల్లారెడ్డి యూనివర్సిటీ ఎం ఆర్ హెచ్ యు బి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మల్లారెడ్డి ,బద్రా రెడ్డి ,డా. వీఎస్ కె రెడ్డి, డా. వై. మాధవి లత ప్రిన్సిపల్ –ఎం ర్ ఈ సి డబ్ల్యూ వారు పాల్గొని తమ విలువైన సందేశాలను అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.... మల్లారెడ్డి ఎం ఆర్ హెచ్ యు బి ప్రాముఖ్యతను వివరిస్తూ, విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశాలు కల్పించడం ముఖ్యమని తెలిపారు. విద్యార్థులు పుస్తక జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ను పెంపొందించుకోవాలి.పరిశ్రమలు , విద్యాసంస్థల మధ్య అనుసంధానం మరింత బలపడాలి. కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు, స్టార్టప్ ఆలోచనలను ప్రోత్సహించాలి. సాంకేతిక పరిజ్ఞానం , నిరంతర అభ్యాసం ద్వారా విద్యార్థులు భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలి. బద్రా రెడ్డి మాట్లాడుతూ... సంస్థ అభివృద్ధి, విద్యార్థుల అవకాశాలు , నూతన కార్యక్రమాల ప్రోత్సాహం గురించి మాట్లాడారు. ముఖ్యాంశాలు: విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా కొత్త అవకాశాలను కల్పించాలి. సృజనాత్మక ఆలోచనలు, ఎంటర్ప్రెన్యూర్షిప్ను ప్రోత్సహించాలి. విద్యార్థులు తమ ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి ఎం ఆర్ హెచ్ యు బి ఉపయోగపడాలి. విద్యా ప్రమాణాలు, సంస్థ అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయి. డా. వీఎస్ కె రెడ్డి మాట్లాడుతూ... ఎం ఆర్ హెచ్ యు బి ద్వారా విద్యార్థులకు పరిశోధన, నూతన ఆవిష్కరణలు మరియు పరిశ్రమ ఆధారిత అభ్యాసానికి మంచి వేదిక లభిస్తుందని తెలిపారు.

ముఖ్యాంశాలు:

పరిశోధన ఇన్నోవేషన్ ప్రాధాన్యత ఇవ్వాలి. ఆధునిక సాంకేతిక రంగాలలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలి. ఇండస్ట్రీ కనెక్ట్ , హ్యాండ్స్–ఆన్ లెర్నింగ్ ద్వారా విద్యార్థులు అనుభవం పొందాలి. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. డా. వై. మాధవి లత ప్రసంగం ప్రిన్సిపల్ ఎం ఆర్ ఇ సి డబ్ల్యూ డా. వై. మాధవి లత ఎం ఆర్ హెచ్ యు బి విద్యార్థులు , అధ్యాపకుల అభివృద్ధికి ఉపయోగపడే ఒక ముఖ్యమైన వేదిక అని తెలిపారు.

ముఖ్యాంశాలు: విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవడానికి, ప్రాజెక్టులపై పనిచేయడానికి సంస్థ ఉపయోగపడుతుంది. నైపుణ్యాభివృద్ధి , పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలి. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి అవకాశాలు పొందుతారు. భవిష్యత్ లో విజయవంతమైన ప్రొఫెషనల్స్గా ఎదగడానికి ఇటువంటి కార్యక్రమాలు సహాయపడతాయి. ఎం ఆర్ హెచ్ యు బి ప్రారంభోత్సవం ద్వారా విద్యార్థులకు, నూతన ఆవిష్కరణలు, పరిశ్రమలతో అనుసంధానం, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన అవకాశాలు, స్టార్టప్ ఎంటర్ప్రెన్యూర్షిప్ ప్రోత్సాహం, కెరీర్ అభివృద్ధి అవకాశాలుఅందించడమే ప్రధాన లక్ష్యంగా తెలియజేశారు. ఎం ఆర్ హెచ్ యు బి విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి, సాంకేతిక ప్రగతికి , నూతన ఆలోచనలకు ఒక ముఖ్యమైన వేదికగా నిలవనుంది.

## మైనర్ బాలిక పై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



ఉస్కేమూరి విజయ్ కుమార్

బుద్వేల్, జూన్ 13 (ప్రభాత ఉదయం): ఖమ్మం లో 12 సంవత్సరాల బాలిక పై జరిగిన దాడికి కారకులైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని రాజేంద్ర నగర్ సర్కిల్ తెలుగుదేశం నాయకులు ఉస్కెమూరి నిరంజన్ డిమాండ్ చేశారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడటం, సాక్ష్యాలు లేకుండ చేయడానికి ఆ బాలికను భవనంపై నుం చి తోసి వేయడం దారుణమైన సంఘటన అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటన లు పునరావృతం కాకుండ చర్యలు తీసుకోవాలన్నారు.

## కోవర్టుల సంగతి తేలుస్తాం

**హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం)**

మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్టులను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

## అసోంలో కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

**మొదటి పేజీ తరువాయి**



పేర్కొన్నారు. ఏఎన్–32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్‌లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

## సమాజంలో మంచి స్థితిలో ఉన్న మాదిగలు పేదరికంలో ఉన్న వారికి చేయూత అందించాలి




గ్రూప్ –1 అధికారులుగా నియమితులైన మాదిగ యువత ను సన్మానిస్తున్న మాస్ ప్రతినిధులు, వివిధ రంగాలలో ఉన్న మాదిగ ప్రముఖులు




ల్యాప్ టాప్ ల బహుకరణ...



సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్ ను సన్మానిస్తున్న మాస్ ప్రతినిధులు

### ఆర్థిక స్థోమత సరిగ్గా లేని విద్యార్థులను ఆదుకోవాలి

### గ్రూప్ -1 అధికారులుగా నియమితులైన మాదిగలను సన్మానం చేసిన మహా ఆది సేవా సమితి నిర్వాహకులు

### విద్యార్థులకు ల్యాప్ టాప్ ల బహుకరణ

**కర్మాన్ ఘట్, జూన్ 13 (ప్రభాత ఉదయం) :**

రాజ్యాంగ నిర్మాత భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానం ఎంతో గొప్పదని, ఆయన ఆశయాల సాధనను ముందుకు తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ఈ తరం ప్రజలపై ఉందని విశ్రాంత ఐ ఆర్ టి ఎస్ అధికారి డాక్టర్ ఎ భరత్ భూషణ్ , సమాచార హక్కు చట్టం రాష్ట్ర కమిషనర్ దేశాల భూపాల్ , విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ మేడి రమేష్, మహా ఆది సేవా సమితి నిర్వాహకులు డాక్టర్ విజయకుమార్, రామకృష్ణ, ప్రొఫెసర్ బి విద్యా సాగర్ , ఎన్ మధు, నక్క యాదగిరి, డాక్టర్ ఎం వీరస్వామి లు పిలుపునిచ్చారు. కర్మాన్ ఘట్ గ్రీన్ పార్క్ కాలనీ శిల్పి గ్రాండ్ హోటల్ లో శనివారం జరిగిన మహా ఆది సేవాసమితి ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని ప్రసంగించారు. చదువుకోవాలని ఆశపడుతూ ఆర్థిక స్తోమత లేక చదువుకు దూరం అయ్యే విద్యార్థుల కోసం మహా ఆది సేవా సమితి (మాస్) అండగా నిలుస్తుందన్నారు . తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మాస్ ప్రతినిధులు సేవా కార్యక్రమాలు చేపడుతూ, విద్యావంతులైన మాదిగ విద్యార్థులకు తోడ్పాటు నందిస్తున్నారని తెలిపారు. విశ్రాంత ఐ ఆర్ టీ ఎస్ అధికారి డాక్టర్ ఎ భరత్ భూషణ్ సహకారం తో యూ పీ పీ ఎస్ సీ కోసం ప్రిపేర్ అయ్యే వారికి అన్ని విధాలుగా సహకారం అందిస్తున్నారన్నారు.



విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మేడి రమేష్ ను సన్మానిస్తున్న మాస్ ప్రతినిధులు

**గ్రూప్ -1 అధికారులకు సన్మానం :**

మాదిగ జాతికి చెందిన గ్రూప్ –1 అధికారులకు మాస్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. డాక్టర్ భరత్ భూషణ్ సహకారంతో యువతి ,యువకులు గ్రూప్ –1 అధికారులుగా నియమితులయ్యారని వారు తిరిగి పే బ్యాక్ టు ద సొసైటీ నినాదాన్ని అందిపుచ్చుకొని ఇతరులకు సహాయం చేసే వారిగా ఉండాలన్నారు.

**విద్యార్థులకు ల్యాప్ టాప్ ల బహుకరణ :**

మాస్ నిర్వాహకుల ఆధ్వర్యంలో వారి స్నేహితులతో మాట్లాడి వారి సహకారంతో తీసుకువచ్చిన ఐదు ల్యాప్ టాప్ లను చదువుకుంటున్న విద్యార్థులకు ఈ సందర్భంగా అందజేశారు. ల్యాప్ టాప్ లు పొందిన విద్యార్థులు బాగా చదువుకొని తిరిగి ఇతర మాదిగ విద్యార్థులకు సహకారం అందించే వారిగా ఎదగాలన్నారు.

ఈ కార్యక్రమంలో మాస్ ప్రతినిధులు అంజయ్య, ఉపేందర్ కుమార్, డాక్టర్ జె కమలాకర్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో భారీ వర్షం

**మొదటి పేజీ తరువాయి**

ఎకానమీ పరిధిలో 'హై అలర్ట్' ప్రకటించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు. వర్షాల వల్ల నగరవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన సత్వర చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వాతావరణ శాఖ అందించే వర్ష సూచన వివరాల ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సీఎం సూచించారు. నగరంలో సాధారణంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, అక్కడ ముందస్తుగానే అత్యవసర బృందాలను మోహరించాలని ఆదేశించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పోలీస్, ట్రాఫిక పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్ శాఖ, వాటర్ బోర్డ్ సహా ఇతర అన్ని సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఒకరితో ఒకరు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలన్నారు. ఈ క్రమంలోనే చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ సీఎస్‌లతో పాటు నగరానికి చెందిన సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షలు నిర్వహించి, తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ట్రాఫిక ఇబ్బందులు లేకుండా చూడటం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.



### పాస్ పోర్ట్ సేవల్లో

## తెలంగాణ పోలీస్ భేష్

**మొదటి పేజీ తరువాయి**

మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ అవార్డును అందుకోవాల్సిందిగా డీజీపీ సీవీ ఆనంద్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారిక ఆహ్వానం పంపింది. జూన్ 19న న్యూఢిల్లీలో డీజీపీ ఈ అవార్డును అందుకోనున్నారు. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేతుల మీదుగా పురస్కార ప్రదానం జరుగనుంది. వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు ధ్రువీకరణ సేవలకే ఈ గుర్తింపు లభించింది. సాంకేతిక ఆధారిత వెరిఫికేషన్ విధానం.. తెలంగాణ పోలీసులకు జాతీయ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. ప్రజా కేంద్రిత సేవలు, సమర్థవంతమైన పనితీరుకు మరో నిదర్శనంగా ఈ అవార్డు నిలిచింది. ఈ ఘనత దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠను మరింత పెంచింది. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలకు ఈ అవార్డు ప్రేరణగా నిలవనుంది.

# షాదీ ముబారక్ పథకంలో నకిలీ పత్రాలతో రూ.21లక్షల ప్రభుత్వ సొమ్మును మోసం చేసిన ముఠా అరెస్ట్

### నిందితులను రిమాండ్‌కు తరలించిన అత్తాపూర్ పోలీసులు

**బుద్వేల్ , జూన్ 13 (ప్రభాత ఉదయం):**

ప్రభుత్వ ప్రతిష్టాత్మక సంక్షేమ పథకమైనన షాదీ ముబారక్ లబ్దిదారుల పేరిట నకిలీ పత్రాలు, నకిలీ ఐడీ ప్రూఫ్ లను సృష్టించి ప్రభుత్వ ఖజానకు రూ.21లక్షల మేర గండి కొట్టిన ఆరుగురు సభ్యుల ముఠా ను అత్తాపూర్ పోలీసులు అత్యంత చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశారు. వివరాలను ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన హసన నగర్ ఫాతిమా కాలనీలో మహ్మద్ ఎతెమాద్, అతని సహచరులు షాదీ ముబారక్ పథకానికి సంబందించి నకిలీ పత్రాలు తయారు చేస్తున్నట్లు అత్తాపూర్ పోలీసులకు సమాచారం అందింది. అలా తయారు చేసిన నకిలీ పత్రాలను బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి ప్రభుత్వ నిధులను అక్రమ ంగా నిర్దిష్ట బ్యాంకు ఖాతాలలోకి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్ కు తెలిపి ఆయన అనుమతులతో అత్తాపూర్ సబ్ ఇన్స్పెక్టర్ జయరాజ్ పోలీసుల బృందం తో హసన్ నగర్ లో మహ్మద్ ఎతేమాద్ నివాసంలో సోదాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆధార్ ఆపరేటర్ గా పనిచేసే మహ్మద్ ఎతెమాద్ పేయింట్, ఆడోబ్ ఫోటోషాప్ సాఫ్ట్వేర్ లను ఉపయోగించి వధువుల ఫోటోలు, ఐడీ వివరాలు (ఆధార్ కార్డులు), వివాహ దృ వపత్రాలు, ఇతర సహాయక పత్రాలను ఫోర్జరీ చేసి నకిలీ డ్యాకుమెంట్లు తయారు చేసినట్లు తెలిసిం ది. మరో నిందితుడు చాంద్రాయణగుట్ట కు చెందిన డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మహ్మద్ అక్బర్ (20) బండ్లగూడ తహసీల్దార్ కార్యాలయంలో స్పెషల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్న బాలాపూర్ మండలం బడంగ్ పేట్ కు చెందిన దరావత్ అశోక్ కిరణ్ (32) కు సమర్పిస్తాడు. ఆయన ఎలాంటి క్షేత్ర స్థాయి పరిశీలన చేయకుండానే నిధులు మంజూరు అయ్యేలా సహకరించాడని పోలీసులు గుర్తించారు. వీరి మోసాలలో హసన నగర్ కు చెందిన జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు, ఆన్ లైన్ సర్వీసెస్ నడిపే సయ్యద్ ముషారఫ్ ఉద్దీన్ (23), జిరాక్స్ షాప్ లో వర్కర్ గా పనిచేసే హసన్ నగర్ కు చెందిన మహ్మద్ సర్ఫరాజ్ (26), ప్రైవేటు ఉద్యోగం చేసే హసన్ నగర్ నివాసి మహ్మద్ జాఫర్ (23) లు సహకరిస్తు లబ్దిదారులను ఎంపిక చేయడం. వారి బ్యాంకు ఖాతాలు తీసుకురావడం, విద్యుత్ బిల్లులు సేకరించడం చేస్తుంటారు. ఈ మోసం ద్వారా వచ్చిన రూ. 21 లక్షలను అందరు పంచుకున్నారు. పోలీసులు స్పెషల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ దరావత్ అశోక్ కిరణ్ తో పాటు నకిలీ పత్రాలతో షాదీ ముబారక్ సొమ్మును కాజేసిన ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి ఒక ల్యాప్టాప్, ఎక హెచ్పీ సీపీయు, ఒక ఫింగర్ మానిటర్, కంప్యూటర్, ఆరు ఫోన్లు, షాదీ ముబారక్ కు చెందిన నకిలీ దరఖాస్తులు, ఫోర్జరీ చేసిన ఐడీ ప్రూఫ్లు, దుర్వినియోగానికి గురైన రూ.21లక్షల చెక్కులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఆరుగురికి రిమాండ్ కు తరలించారు.


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

**ఎవరైన డబ్బులు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలి: ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు :**

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ది చేకూరుస్తామని చెప్పి ఎవరైన మధ్యవర్తులు డబ్బులు అడిగితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు ప్రజలకు సూచించారు.

**అభినందనలు :**

నకిలీ పత్రాలతో షాదీ ముబారక్ నిధులను స్వాహా చేసిన నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన రాజేంద్రనగర్ ఏసీపీ తుల శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్ ఇన్స్ పెక్టర్ కె రవి, అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ కె నాగేశ్వర్ రావు, సిబ్బందిని రాజేంద్రనగర్ డీసీపీ ఎస్ శ్రీనివాస్, అధనపు డీసీపీ కె శ్రీనివాస్ రావు లు అభినందిం చారు.


వర్షం పడుతున్న చేపట్టిన ఎవరు వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్ పోలీసులు...

# వాన కురిసినా... వడగండ్లొచ్చినా... మీ కోసమే 'సైబరాబాద్' ఖాకీ సైన్యం!

### గుండె తడిని చాటుకున్న 'లా అండ్ ఆర్డర్'.. కర్తవ్య దీక్షలో తడిసినా, ట్రాఫిక్‌ను నడిపించిన వైనం

**శేరిలింగంపల్లి : జూన్ 13, (ప్రభాత ఉదయం)**

మబ్బు పడితే చాలు.. మహానగరం వణికిపోతుంది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టు వాన కురుస్తుంటే, రోడ్లన్నీ చెరువులను తలపిస్తుంటే.. సగటు మనిషి క్షేమంగా ఇల్లు చేరాలని ఆరాటపడతాడు. కానీ, అదే వానలో.. ఒంటిపై ఉన్న ఖాకీ చొక్కా పూర్తిగా తడిసిపోతున్నా, బూట్లలోకి నీరు చేరుతున్నా.. లెక్కచేయకుండా రోడ్డుపై నిలబడ్డారు 'సైబరాబాద్' పోలీసులు. తల దాచుకోవడానికి చిన్న గొడుగు కూడా దొరకని ఆ జడివానలో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజల కోసం వారు చేసిన సేవలు ప్రతి ఒక్కరి మనసును కదిలించాయి. నగరంలో రోజు కురుస్తున్న వర్షానికి సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ఇటువంటి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లోనూ సైబరాబాద్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు రోడ్లపైనే ఉండి అలుపెరగని పోరాటం చేశారు.ప్రధాన కూడళ్లు, తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఉండే ఐటీ కారిడార్ ప్రాంతాలు, మోకాళ్ల లోతు నీరు నిలిచిన లోతట్టు ప్రాంతాలలో ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా, గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా సజావుగా సాగేలా చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు పొంగిపొర్లుతున్న చోట స్వయంగా వారే నిలబడి వాహనదారులను సురక్షిత మార్గాల వైపు మళ్లించారు.మరోవైపు, కేవలం శాంతిభద్రతలకే పరిమితం కాకుండా 'లా అండ్ ఆర్డర్' సిబ్బంది వర్షంలో తడుస్తూనే ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించారు. వర్షం వల్ల రోడ్లపై చిక్కుకుపోయిన వృద్ధులు, మహిళలు, పిల్లలను సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. ప్రమాదకరంగా మారిన గుంతల వద్ద, విద్యుత్ స్తంభాల వద్ద ప్రజలను అప్రమత్తం చేస్తూ పెద్ద ప్రమాదాలు జరగకుండా అడ్డుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు కంట్రోల్ రూమ్ సిబ్బందితో పాటు క్షేత్రస్థాయి పోలీసు యంత్రాంగం అంతా క్షణం విశ్రాంతి లేకుండా పనిచేసింది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావద్దు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, కారు డ్రైవర్లు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి. రోడ్లపై విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసుల సూచనలను ఖచ్చితంగా పాటించి పోలీసు యంత్రాంగానికి సహకరించాలని కోరారు. తడిసిన ఖాకీ దుస్తుల్లోనే నవ్వుతూ ప్రజాసేవ చేసిన పోలీసుల దృశ్యాలు సోషల్ మీడియాలోనూ వైరల్ అయ్యాయి. "మా క్షేమం కోసం వర్షంలో తడుస్తున్న 'ఖాకీ'ల త్యాగానికి సెల్యూట్" అంటూ నగర ప్రజలు నెటిజన్లు సైబరాబాద్ పోలీసులపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చు.. ప్రకృతి పరిరక్షణే లక్ష్యంగా జేఎన్‌టీయూహెచ్‌లో మొక్కలు నాటిన పీహెచ్‌డీ స్కాలర్స్ చల్లా రామకృష్ణ రెడ్డి

**కూకట్ పల్లి, జూన్ 13 (ప్రభాత ఉదయం)**



హైదరాబాద్ జేఎన్‌టీయూహెచ్ లో ప్రధాన మంత్రి సూచనల మేరకు ప్రకృతి పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడడం లక్ష్యంగా పీహెచ్డీ స్కాలర్ చల్లా రామకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూహెచ్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. ఎల్.సైదా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌డీ స్కాలర్స్ చల్లా రామకృష్ణ రెడ్డి, పితాని సందీప్ గౌడ్, బీటెక్ విద్యార్థులు జయరామ్, సాయిరామ్, స్పందన, సరయు, సంపత్, మనీష్, విశ్వజిత్, యశోవర్ధన్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర నాయకులు కుమార్ యాదవ్, భరత్ వీర్ ప్రత్యేక అతిథులుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రకృతి బాగుండాలి...గ్రీనరీ పెరగాలి అనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు రామకృష్ణ రెడ్డి తెలిపారు.



# ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతలు విధిగా ఏర్పాటు చేసుకోవాలి

### జలమండలి ఎండి అశోక్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 13(ప్రభాత ఉదయం)**

ఇంకుడు గుంతలు ప్రతి ఇల్లు, అపార్ట్‌మెంట్‌లో తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో ఈ ఏడాది మే, జూన్ నెలల్లో సుమారు 12 వేల అపార్ట్‌మెంట్లలో బోర్‌వెల్లు ఎండిపోయాయని తెలిపారు.హైదరాబాద్ చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున భూగర్భ జలాల క్షీణత నమోదవడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ప్రతి భవనంలో వర్షపు నీటి సంరక్షణ చర్యలు చేపట్టకపోతే వచ్చే ఏడాది వేసవిలో భూగర్భ జలాల కొరత మరింత తీవ్రంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. గోదావరి ఫేజ్-2, ఫేజ్-3 నీటి ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు నీటి వనరుల పరిరక్షణపై ప్రజలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.భవిష్యత్ తరాలకు తగిన నీటి భద్రత కల్పించాలంటే ప్రతి పౌరుడు వర్షపు నీటి సంరక్షణలో భాగస్వామి కావాలని ఆయన కోరారు.

# పత్తికుంట పూడిక తీయకపోవడం బాధాకరం : వై.శ్రీధర్

**బుద్వేల్, జూన్ 13 (ప్రభాత ఉదయం)**



వినాయక నిమజ్జనాలు జరిగే పత్తికుంట లో పూడిక తీత పనులు చేయాలని రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని, ప్రస్తుతం వర్షాలు వచ్చి పత్తి కుంటలో నీరు వచ్చిందని, ఇప్పుడు ఎలా పూడిక తీస్తారని రాజేంద్రనగర్ నియోజకవర్గం గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ ఓ ప్రకటన లో అధికారులను ప్రశ్నించారు. మృగశిర కార్తె ను ంచే వర్షాలు పడతాయని, అంతకు ముందే పత్తికుంట లో పూడిక తీత పనులు చేపట్టాలని గ్రేటర్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్ లతో పాటు రాజేంద్రనగర్ జోన్ ఎస్ఈ గా ఉన్న నరేందర్ గౌడ్, ఇటీవల జోనల్ కమిషనర్ గా వచ్చిన సోలిపేట శ్రీనివాస్ రెడ్డి లను కలిసి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. అయినా ఎలాంటి స్పందన రాలేదన్నారు. పత్తికుంట లో రాజేంద్రనగర్ నియోజకవర్గం తో పాటు బహదూర్ పుర , కార్వాన్, చేవెళ్ల నియోజకవర్గాల నుంచి వేలాది వినియక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి తీసుకువస్తారని గుర్తు చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా భకు లు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. నిమజ్జనం చెరువులను ముందుగానే పూడిక తీయాలనే ఆలోచన అధికారులలో ఉ ండాలని ఆయన కోరారు.

# వర్షాల కారణంగా ఏర్పడే ట్రాఫిక్ అంతరాయాలను తగ్గించేందుకు పోలీసుల ముమ్మర చర్యలు

### ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు

### అవసరమైతేనే బయటికి రావాలని వాహనదారులకు సీఐ సుబ్బారావు, ట్రాఫిక్ సిఐ తిమ్మప్ప సూచన

**కూకట్ పల్లి, జూన్ 13 (ప్రభాత ఉదయం)**



నగరంలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రజల భద్రతతో పాటు వాహనాల రాకపోకలు అంతరాయం కలగకుండా కూకట్ పల్లి ప్రాంతంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్ విభాగం, ట్రాఫిక్ విభాగం అధికారులు సంయుక్తంగా ట్రాఫిక్ క్లియరెన్స్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. ప్రధాన రహదారులు, రద్దీ కూడళ్ల వద్ద ప్రత్యేక బృందాలను మోహరించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. వర్షాల కారణంగా ఏర్పడే ట్రాఫిక్ అంతరాయాలను తగ్గించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్హెచ్) సూచించారు. వర్షాల సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# తాగునీరు, సీవరేజ్ సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి: అశోక్ రెడ్డి

### జలమండలి ఉన్నతాధికారులతో ఎండీ జూమ్ మీటింగ్

**హైదరాబాద్, జూన్ 13 (ప్రభాత ఉదయం)**




నగరంలో ఎలాంటి తాగునీరు, సీవరేజ్ ఇబ్బందులు లేకుండా అన్ని రకాలుగా ముందస్తు చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ఉన్నతాధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. నెలవారీ నిర్వహించే ఈ మీటింగ్ లో పలు కీలక సూచనలు, ఆదేశాలిచ్చారు.నగరంలోని అన్ని ప్రధాన రహదారులపై ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా వాటర్ లీకేజీలు, సివరేజీ ఓవర్‌ఫ్లోలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అన్ని ముఖ్య ప్రాంతాల్లో మ్యాన్‌హోల్ మూతలు పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మత్తులు చేయించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అలాగే మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలను (సిల్ట్) ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఎయిర్ టెక్ యంత్రాలు, సిల్ట్ కార్ట్ వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఎంసీసీ ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. కలుషితనీరు సమస్యలను పరిష్కరించడానికి ప్రాముఖ్యతనివ్వాలి సూచించారు. పగటి పూట ప్రధాన రహదారుల్లో ఏదైనా సమస్యలు పరిష్కారానికి చేపట్టే మరమ్మతులతో ట్రాఫిక్ ఆటంకం కాకుండా.. రాత్రిపూట పనులను చేపట్టాలని సూచించారు.

# సామాజిక భాగస్వామ్యంతో కూకట్‌పల్లి జోన్‌లో పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలన

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

### కూకట్ పల్లి డీసీ ఆంజనేయులు

**కూకట్ పల్లి, జూన్ 13 (ప్రభాత ఉదయం)**



సైబరాబాద్ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి జోన్ పరిధిలో గుర్తించిన పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లు ప్రజల భాగస్వామ్యం, సమన్వయం, పారిశుద్ధ్య సిబ్బంది కృషితో విజయవంతంగా నిర్మూలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజల సహకారంతో పాటు పారిశుద్ధ్య సిబ్బంది, రామ్‌కీ సంస్థ సిబ్బంది చురుకుగా పాల్గొని పలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను లక్ష్యంగా తీసుకొని శు భ్రపరిచారు. అనంతరం ఆ ప్రదేశాలను పూలతో, రంగవల్లులతో అలంకరించి పరిశుభ్రమైన వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలనపై హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ ప్రాంతాల్లో చెత్త వేయకుండా పరిశు భ్రతను కాపాడేందుకు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూకట్ పల్లి డీసీ ఆంజనేయులు మాట్లాడుతూ పరిశుభ్రమైన పరిసరాల కోసం పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా, పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని సూచించారు. సమాజం, పారిశుద్ధ్య సిబ్బంది, స్థానిక సంస్థల సమిష్టి కృషితో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు.

# ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా
# 100 అడుగుల రహదారి విస్తరణ

**ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి చేస్తాం.. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదు**

**ఉషముళ్లపూడి కమాన్--గాజులరామారం మార్గంలో పనుల వేగం పెంచాలని అధికారులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆదేశం**




**కూకట్ పల్లి, జూన్ 13 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉషముళ్లపూడి కమాన్--గాజులరామారం ప్రధాన రహదారి విస్తరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వయా ఎల్లమ్మబండ మార్గంలో చేపట్టిన 100 అడుగుల రహదారి విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, ఆల్విన్ కాలనీ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి, వివిధ శాఖల అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ఉషముళ్లపూడి కమాన్ నుంచి గాజులరామారం వరకు ఎల్లమ్మబండ మార్గంలో ప్రతిరోజూ తీవ్రమైన ట్రాఫిక్ సమస్య నెలకొని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 100 అడుగుల రహదారి విస్తరణ పనులను ప్రభుత్వం చేపట్టిందన్నారు. గతంలో తానే స్వయంగా అధికారులతో కలిసి ఉషముళ్లపూడి కమాన్ నుంచి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర నిర్వహించి, రహదారి విస్తరణకు ఉన్న అడ్డంకులను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను దశలవారీగా తొలగిస్తూ ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు.

**అడ్డంకుల తొలగింపు -- యుద్ధప్రాతిపదికన పనులు**

రహదారి మధ్యలో ఉన్న భారీ బండరాళ్ల తొలగింపు, విద్యుత్ స్తంభాల స్థానభ్రంశం, చెట్ల కొమ్మల తొలగింపు వంటి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని గాంధీ తెలిపారు. రహదారి విస్తరణ సమయంలో దెబ్బతిన్న మంచినీటి పైప్‌లైన్‌ను వెంటనే పునరుద్ధరించే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పనులు చేపడుతున్న సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

**అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ లేదు**

రహదారి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ఎక్కడా రాజీ పడకూడదని పీఏసీ చైర్మన్ స్పష్టం చేశారు. ప్రజల డబ్బుతో చేపడుతున్న అభివృద్ధి పనులు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా నిర్మించాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా రహదారి డివైడర్ల మధ్య సుందరీకరణ పనులు చేపట్టి, రహదారిని ఆధునికంగా తీర్చిదిద్దాలని సూచించారు. రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను వేగంగా తరలించి పనులకు ఆటంకాలు తొలగించాలని చెప్పారు.

**సమయం -- ఇంధనం ఆదా**

100 అడుగుల విస్తృత రహదారి అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడమే కాకుండా ప్రజల సమయం, ఇంధనం కూడా ఆదా అవుతుందని గాంధీ పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యవంతమైన, వేగవంతమైన రవాణా వ్యవస్థ అందించడమే లక్ష్యమని చెప్పారు. "ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యాల కల్పన కోసం శాయశక్తులా కృషి చేస్తాను. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తాను" అని ఆయన హామీ ఇచ్చారు.

**శేరిలింగంపల్లి అభివృద్ధే లక్ష్యం**

శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నానని, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనలో తనవంతు బాధ్యత నిర్వర్తిస్తానని ఆరెకపూడి గాంధీ పునరుద్ఘాటించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**ఉషముళ్లపూడి కమాన్--గాజులరామారం మార్గంలో 100 అడుగుల రహదారి విస్తరణ**

ఎల్లమ్మబండలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యం, విద్యుత్ స్తంభాల స్థానభ్రంశం, బండరాళ్ల తొలగింపు వేగవంతం చేయాలని అన్నారు.దెబ్బతిన్న మంచినీటి పైప్‌లైన్ పునరుద్ధరణ

**నాణ్యతలో రాజీ లేకుండా యుద్ధప్రాతిపదికన పనులు**

సమయం, ఇంధనం ఆదా చేసే ఆధునిక రహదారి నిర్మాణం చేపట్టాలని, శేరిలింగంపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు.



రాయదుర్గం మల్కంచెరువును పరిశీలిస్తున్న బిజెపి సిరి ఆనందం ,సిఎంసి కమిషనర్ సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్..

# క్షేత్రస్థాయిలో డీజీపీ సీవీ ఆనంద్ పర్యటన.. పోలీసు యంత్రాంగం హై అలర్ట్!

**శేరిలింగంపల్లి : జూన్ 13, (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్‌తో పాటు తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్ర పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. స్వయంగా రంగంలోకి దిగిన రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ నగరంలోని పలు వరద ప్రభావిత ప్రాంతాలలో క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు ఎక్కువగా ఉన్న టోలిచౌకి పరిసర ప్రాంతాలు, మల్కం చెరువు తదితర ప్రాంతాలను ఆయన సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ట్రాఫిక్ ఇరుక్కుపోకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో భాగంగా డీజీపీ సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, జీహెచ్ఎంసీ సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజనలతో కలిసి తాజా పరిస్థితులపై చర్చించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, మున్సిపల్ సిబ్బందితో కలిసి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

**డీజీపీ జారీ చేసిన ముఖ్య ఆదేశాలు**

రోడ్లపై నీరు నిలవకుండా చూడటంతో పాటు, ట్రాఫిక్ జామ్ అయ్యే జంక్షన్ల వద్ద అదనపు సిబ్బందిని కేటాయించి రద్దీని క్రమబద్ధీకరించాలి. కమిషనరేట్లలో హై అలర్ట్ హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు వర్ష ప్రభావిత జిల్లాల పోలీస్ అధికారులు అందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలి. జిల్లా యంత్రాంగాలు, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ మున్సిపల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో వాహనదారులు, ప్రజలు ప్రయాణాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డీజీపీ సూచించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లోకి వెళ్లవద్దని, పోలీసులు , మున్సిపల్ అధికారులు ఇచ్చే అధికారిక సూచనలను పాటించాలని కోరారు. ప్రజల రక్షణే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ శాఖ 24 గంటలు అందుబాటులో ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్. శ్రీనివాస్, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, రాయదుర్గం ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ పవన్ లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మోదీ నాయకత్వంలో సుశక్త భారత నిర్మాణం

**12 ఏళ్ల పాలనలో అభివృద్ధి, సుపరిపాలనకు కొత్త దిశ**

**భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్ పోలాకి**

**కూకట్ పల్లి, జూన్ 13 (ప్రభాత ఉదయం)**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా భారతదేశం అభివృద్ధి, సుపరిపాలన, సంస్కరణల దిశగా వేగంగా ముందుకు సాగుతోందని భారతీయ జనతా పార్టీ మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్ పోలాకి పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, "సేవ, సుపరిపాలన, సంక్షేమం సంస్కరణలు" అనే లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం దేశంలోని ప్రతి వర్గం ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. "సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయత్న్" అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ మోదీ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం అనేక ప్రజాహిత పథకాలను



అమలు చేస్తోందని తెలిపారు.గత 12 ఏళ్లలో దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక పురోగతి, జాతీయ భద్రత రంగాల్లో విశేషమైన మార్పులు చోటుచేసుకున్నాయని ఆయన అన్నారు. రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, డిజిటల్ సేవల విస్తరణతో దేశం అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను మరింత పెంచడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించారని కిషోర్ కుమార్ పోలాకి తెలిపారు. ప్రపంచ దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేస్తూ, భారతదేశాన్ని ప్రపంచ వేదికపై శక్తివంతమైన దేశంగా నిలబెట్టారని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం మోదీ ప్రభుత్వ దూరదృష్టి, సమర్థవంతమైన పాలనకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ ఇండియా, యూపీఐ, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. అలాగే, భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానమంత్రిగా పనిచేసిన జవహర్లల్ నెహ్రూ పదవీకాల రికార్డును అధిగమించి, అత్యధిక కాలం సేవలందించిన బీజేపీ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ కొత్త చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీకి అభినందనలు తెలియజేస్తూ, దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో కూడా అభివృద్ధి, సంక్షేమం, జాతీయ గౌరవాన్ని మరింత పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# చంద్రుడిపై 200 రోజులు.. సుదీర్ఘ ప్రయోగాలకు ఇస్రో సిద్ధం

**చంద్రుడిపై ల్యాండర్ల జీవితకాలాన్ని పెంచేందుకు ఇస్రో కృషి**

**ప్రస్తుత 14 రోజుల నుంచి 100-200 రోజులకు పెంచడమే లక్ష్యం**

**అణుశక్తి విభాగంతో కలిసి కృత్రిమ హీటర్ల అభివృద్ధి**

**చంద్రుడిపై రాత్రివేళ తీవ్రమైన చలిని తట్టుకునేలా ఈ టెక్నాలజీ**

**భవిష్యత్ పరిశోధనలకు ఇది కీలకం కానుందన్న ఇస్రో ఛైర్మన్**

**న్యూఢిల్లీ, జూన్ 13 (ప్రభాత ఉదయం)**




చంద్రుడిపై భవిష్యత్తులో చేపట్టే ప్రయోగాల దిశగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో కీలక అడుగు వేస్తోంది. జాబిలిపై దిగే ల్యాండర్ల పనితీరు కాలాన్ని ప్రస్తుత 14 రోజుల నుంచి 100-200 రోజులకు పెంచేలా అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నట్లు ఇస్రో ప్రతినిధి వి. నారాయణన్ వెల్లడించారు. శనివారం బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ కీలక వివరాలను పంచుకున్నారు.


చంద్రుడిపై రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోతాయి. ఆ సమయంలో సౌరశక్తి లభ్యత ఉండదు కాబట్టి, ల్యాండర్‌లోని సున్నితమైన ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతినకుండా రక్షించడమే ఈ నూతన సాంకేతికత ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం అణుశక్తి విభాగం (డీఏఈ) భాగస్వామ్యంతో ప్రత్యేకమైన కృత్రిమ హీటర్లను రూపొందిస్తున్నట్లు నారాయణన్ వివరించారు.


2023 ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువంపై చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిన చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్, ప్రగ్యాన్ రోవర్ కేవలం ఒక లూనార్ డే (భూమిపై 14 రోజులు) మాత్రమే కార్యకలాపాలు సాగించాయి. చంద్రుడిపై రాత్రి ప్రారంభం కావడంతో, అక్కడి అత్యంత శీతల పరిస్థితులను తట్టుకునే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేకపోవడంతో వాటిని 'స్లీప్ మోడ్'లోకి పంపాల్సి వచ్చింది.

"ప్రస్తుతం మేము కృత్రిమ హీటర్లను అభివృద్ధి చేసే పనిలో ఉన్నాం. ఈ ప్రయోగం సత్ఫలితాలనిస్తే, భవిష్యత్తులో ల్యాండర్లు కేవలం 14 రోజులే కాకుండా, 100 నుంచి 200 రోజుల వరకు నిరంతరాయంగా పనిచేసే అవకాశం ఉంటుంది" అని నారాయణన్ పేర్కొన్నారు. ఈ సాంకేతికత అందుబాటులోకి వస్తే చంద్రుడిపై దీర్ఘకాలిక పరిశోధనలకు, మరింత లోతైన శాస్త్రీయ సమాచార సేకరణకు వీలు పడుతుంది. ఇది భవిష్యత్తులో భారత్ చేపట్టబోయే మానవసహిత మరియు రోబోటిక్ మిషన్లకు ఎంతో ఊతమిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్లాస్టిక్ వ్యర్థాలు మానవాళికి ముప్పు

**స్వాన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మేఘన**








**పటాన్ చెరు, జూన్ 13 (ప్రభాత ఉదయం):**

మానవాళికి పెను ముప్పును తెస్తోన్న ప్లాస్టిక్ వినియోగాన్ని విస్మరించి పర్యావరణ పరిరక్షణ లో అందరూ భాగస్వాములు కావాలని స్వాన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు మేఘన పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలోని మంబాపూర్ అటవీ ప్రాంతం లో ప్రకృతిని, అడవులను కాపాడుకోవడమే లక్ష్యంగా "స్వాన్" స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భారీ ఎత్తున క్లీనప్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ క్లీనప్ డ్రైవ్‌లో అడవిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ఏరివేసి, అటవీ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఇప్పటివరకూ సుమారు ఐదు వందల మందితో రెండు పర్యాయాలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో టన్నుల కొద్దీ చెత్త సేకరణ చేసినట్లు ఆమె చెప్పారు. అటవీ ప్రాంతంలో జంతువులకు ఆహారం అందించ వద్దని,అలా చేస్తే జంతువులు సహజంగా ఆహారం సేకరించడం మానేసి జనావాసాలపై ఆహారం కోసం దాడులకు దిగుతాయని కాబట్టి ఈ విషయంపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పర్యావరణ స్పృహపై, అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యతపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు కళాకారులతో 'నుక్కడ్ నాటక్' (వీధి నాటకం) ప్రదర్శించారు. "మనమందరం కలిసికట్టుగా ఉంటేనే మన అడవులను పచ్చగా, పరిశుభ్రంగా ఉంచుకోగలమని. రాబోయే తరాలకు పచ్చని భవిష్యత్తును అందించడమే తమ లక్ష్యం" అని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఫార్చ్యూన్ హెడ్ ప్రిన్సిపాల్ సుధారాణి, నర్సాపూర్ మున్సిపల్ ఛైర్పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, గుమ్మడిదల అటవీశాఖ అధికారులు, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608